క్లుప్తంగా

మంత్రిని కలిసిన సాంబ, వీరాంజనేయులు



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు

శింగనమల: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మరూరు టోల్‌గేట్ వద్ద ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన వీరాంజినేయులు శనివారం కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజినేయులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

పామిడి: స్థానిక గ్రామ పంచాయతీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న మూడేళ్ల ఇంటిపన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని పంచాయతీ ఈఓ పీ చంద్రశేఖర్ ప్రజలను కోరారు. ఈమేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. వివరాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి నగదు అందిస్తున్న సర్పంచ్ ప్రమీలమ్మ

పామిడి: నీలూరు గ్రామానికి చెందిన సుంకన్న అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం సర్పంచ్ బెల్లాల ప్రమీలమ్మ సుంకన్న భార్య ఉమామహేశ్వరికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను అందజేశారు. గజరాంపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షాను, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి బెల్లాల రమణారెడ్డి, వలంటీర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు విద్యార్థి ఎంపిక



శ్రీకాంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య

గుంతకల్లుటౌన్: ఈ నెల 26న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి ఎం.శ్రీకాంత్ ఎంపికయ్యాడు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, అధ్యాపకులు శనివారం కళాశాలలో సదరు విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జనార్దన్‌శాస్త్రి, రవిశంకర్ శర్మ, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ బాలకృష్ణ, కార్యాలయ సూపరింటెండెంట్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో శనివారం బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. గుంతకల్లు మండలం గుండాలకు చెందిన రామేశ్వరయ్య పని మీద తన స్నేహితునితో కలిసి బైక్‌పై గుత్తికి వచ్చాడు. తిరిగి బైక్‌లో తన ఊరికి బయలుదేరాడు. అయితే గుంతకల్లు రోడ్డులో బైక్ పై నుంచి జారి కింద పడి గాయపడ్డాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు.

విధుల్లోకి అంగన్‌వాడీలు



సీడీపీఓ డిల్లీశ్వరికి జాయినింగ్ రిపోర్టు అందిస్తున్న అంగన్‌వాడీలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు శనివారం విధుల్లో చేరారు. తమ డిమాండ్లు తీర్చాలని కోరుతూ 40 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె బాట పట్టిన విషయం విదితమే. జూలైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం ప్రకటించింది. ఈనేపథ్యంలో శనివారం గుత్తి మున్సిపాలిటీ పరిధిలో 12 మంది అంగనవాడీ టీచర్లు, 10 మంది ఆయాలు సమ్మె విరమించి జాయినింగ్ రిపోర్టును సీడీపీఓ డిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరికి అందజేశారు. గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన పలువురు జాయినింగ్ రిపోర్టు ఇచ్చినట్లు ఐసీడీఎస్ అధికారులు వెల్లడించారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు తెచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులకు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఏదైనా సంక్షేమ పథకం కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఉండేదన్నారు. కనీసం అవ్వాతాతలు పింఛన్ అందుకోవాలన్నా ఎంతో ప్రయాస పడేవారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రజలు అలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకే తెచ్చి అందరి ఇబ్బందులను తొలగించారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పుల్లారెడ్డి, సర్పంచ్ శ్రీదేవి, ఎంపీటీసీ పవన్‌కుమార్‌రెడ్డి, ఆలూరు రామేశ్వరెడ్డి, ఎంపీడీఓ రంగారావు, వ్యవసాయ శాఖ ఏడీ చంగల్‌రాయుడు, ఏఓ మహితా కిరణ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లెనాగేశ్వరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, నాయకులు కిరణ్‌కుమార్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి,





సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీటీసీ రమణమ్మ, సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

మల్లికార్జునరెడ్డి, శంకరరెడ్డి, పుల్లారెడ్డి, రమణారెడ్డి, కత్తి నాగేశ్వరరెడ్డి, కత్తి రాజశేఖరరెడ్డి, దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

యాడికి: వ్యవసాయానికి నిరంతరంగా విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం నగరూరు గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుప్పాలతాండా, పుప్పాల, వెంగన్నపల్లె, భోగాలకట్ట, నగరూరు, తూట్రాళ్లపల్లెతో పాటు పెద్దవడుగూరు మండలం కోనాపురం, రావులుడికి గ్రామాలకు పెద్దపేట వద్ద ఉన్న సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. ఓవర్ లోడ్‌తో కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడేదన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలతో కలిసి మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేశారన్నారు. సబ్‌స్టేషన్‌కు స్థల సమస్య రావటంతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి నగరూరు పంచాయతీలో రూ.40 లక్షలు విలువ చేసే 1.25 ఎకరాల భూమిని తన తండ్రి వెన్నపూస నాగిరెడ్డి(టీచర్) జ్ఞాపకార్థం దానం చేయటంతో దాదాపు ఏడాదిలోపే సబ్‌స్టేషన్ నిర్మించామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చాగల్లు రిజర్వాయర్ పూర్తిగా నిండి ఎండిన బోర్లలో పుష్కలంగా నీరు వస్తోందని, ఇపుడు విద్యుత్ సమస్య తీరడంతో పంటలు పండించుకోవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు, స్థలదాత జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

సీసీరోడ్డు, డ్రైనేజీ ప్రారంభం

నగరూరు గ్రామంలో సాయిబాబా ఆలయం వద్ద నుంచి దాదాపు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డుతో పాటు, డ్రైనేజీని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మార్కెట్‌యార్డు చైర్మన్ హరినాథ్‌రెడ్డి, విద్యుత్ ఈఈ రాజశేఖర్, డీఈఈ రఘు, ఏఈ రాజారావు, నగరూరు, తూట్రాళ్లపల్లె సర్పంచులు రుక్మాందరరెడ్డి, సంజీవరాయుడు, నగరూరు ఉప సర్పంచు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వెన్నపూస నాగరాణి, చిన్న వెంకటరామిరెడ్డి, ధనంజయరెడ్డి, కరుణాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాగేంద్రరెడ్డి, హనుమంత రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



బాధితుడు రాజేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: మల్లేనిపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్‌కు ఎమ్మెల్యే రూ.50 వేలు ఆర్థిసాయం అందించాడు. దళిత వర్గానికి చెందిన రాజేష్‌కు బ్రెయిన్‌లో బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టడంతో తీవ్ర అనారోగ్యంతో వారం క్రితం కర్నూలులో చికిత్స పొందేవాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైవీఆర్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం నిమిత్తం బాధితుడిని హైదరాబాద్‌కు తరలించేలా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న రాజేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే వైద్య ఖర్చుల కోసం అతడికి రూ.50 వేలు ఆర్థిక నగదు అందజేశాడు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఎల్‌ఓసీ ద్వారా రూ.5 లక్షలు చెక్కును అందిస్తూ కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి భరోసా కల్పించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

పెద్దవడుగూరు: స్థానిక ఎస్సీకాలనీలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులుగా సుధాకర్, లోకేష్, పవన్‌కుమార్, మహిళా కమిటీ గౌరవాధ్యక్షురాలిగా నారమ్మ, అధ్యక్షురాలిగా మద్దిలేటమ్మ, ఉపాధ్యక్షురాళ్లుగా జయమ్మ, రంగమ్మ, సంజమ్మ ఎన్నికైనట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపతిలు తెలిపారు. ఎస్సీల సమస్యలపై నిరంతరం పోరాటా చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

24న మండల సర్వసభ్య సమావేశం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 24న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలు ఊరేగిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: అయోధ్య శ్రీరాముడి అక్షింతలను శనివారం యర్రగుంట్లలో భక్తులు ఊరేగించారు. మేళతాళాల నడుమ అక్షింతలను ఊరేగిస్తూ వాటిని ఇంటింటికీ పంపిణీ చేశారు.

జూదరుల అరెస్ట్

యల్లనూరు: మండల కేంద్రం శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2,460 నగదు స్వాదీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు. ఇదిలా ఉండగా బుక్కాపురం గ్రామంలో వీర లక్ష్మమ్మ అనే మహిళ మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితురాలి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న పునీత్

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోడ్‌నెస్ట్ క్యాంపస్ లీడ్ ఆఫీసర్ పునీత్ పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కోడ్‌నెస్ట్ ఈటెక్, ఉత్పత్తి ఆధారిత సంస్థ సీఎస్ఆర్ డ్రైవ్-2024 క్యాంపస్ డ్రైవ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ఉద్యోగ నియామక ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. కంపెనీల ప్రత్యేకతలు, ఏ విధంగా ఉపాధి పొందాలో తెలిపారు. కళాశాలలో నిర్వహించిన కోడ్‌నెస్ట్‌కు 53 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి స్క్రీనింగ్ టెస్ట్, ముఖాముఖి ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోడ్‌నెస్ట్ ప్రతినిధులు రిషి, రఘుల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బుక్కరాయసముద్రం: కర్ణాటక, తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం రవాణా చేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని తాడిపత్రి, అనంతపురం రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం, గుట్కా, మత్తు పదార్థాలు రవాణా పూర్తిగా నిషేధమని, వాటిని రవాణా చేస్తే సహించేది లేదన్నారు. ఎవరైనా వాటిని రవాణా చేసినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలో ఇక నుంచి రోజూ పోలీసుల తనిఖీ ఉంటుందన్నారు. వాహనదారులు వాహన రికార్డులను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా రికార్డులు లేని పలు వాహనదారులకు జరిమానా విధించారు. ఏఎస్ఐ ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ గ్రామీణ పార్కు అభివృద్ధికి కృషి



పార్కులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఏర్పాటు చేసిన వైఎస్సార్ గ్రామీణ పార్కు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పార్కులో పర్యటించారు. ఈ సందర్భంగా పార్కులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఐ లవ్ తాడిపత్రి సైన్‌బోర్డును పనులను పరిశీలించారు. పార్కును సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జల దిన్నె రాజు, నాయకులు ఆలూరు రామేశ్వరెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న భోగేశ్వరాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పామిడి: పట్టణంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి చొరవతో రూ.కోటి సీజీఎఫ్ నిధులతోపాటు భక్తుల రూ.40 లక్షల విరాళంతో కలిపి మొత్తం రూ.1.40 కోట్లతో విమానగోపురం, ఆలయ పునర్నిర్మాణం చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వైవీఆర్‌తో పాటు రాష్ట్ర దేవదాయ శాఖామాత్యులు కే సత్యనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ రంగయ్య తదితర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

25న అశ్వత్థంలో వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం తిరునాల సందర్భంగా టెంకాయల విక్రయం, తలనీలాలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు కోసం ఈ నెల 25న బహిరంగ వేలం జరగనుంది. ఈ మేరకు ఈఓ సుబ్రహ్మణ్యం, చైర్మన్ చిక్కేపల్లె శ్రీనివాసులు రెడ్డి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వేలంలో పాల్గొనే వారు రూ.50 వేలు అడ్వాన్స్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న జైశ్రీరామ్ భక్త మండలి సభ్యులు



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

తాడిపత్రి అర్బన్: అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని పట్టణంలో జై శ్రీరామ్ భక్తమండలి ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన సాగింది. భక్తమండలి అధ్యక్షుడు నిచ్చనమెట్ల రాధాకృష్ణ, బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్థానిక వాల్మీకి సర్కిల్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి హనుమాన్ చాలీసా పఠిస్తూ సీబీరోడ్డు మీదుగా హనుమాన్ జంక్షన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ హనుమాన్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మెయిన్‌బజార్ మీదుగా గాంధీకట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడ మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా రామనామ స్మరణతో వీధులన్నీ మార్మోగిపోయాయి. పట్టణమంతా కాషాయ జెండాలతో దర్శనమిచ్చింది. బీజేపీ నాయకులు అంకాల్‌రెడ్డి, పోతుల గంగాధర్ యాదవ్, రామాంజనేయులు, ఈశ్వర్‌రాజు, సింగరి లక్ష్మీనారాయణ, ఏబీవీపీ నాయకులు అఖిల్‌కుమార్ రెడ్డి, మనోజ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే పారదర్శకంగా చేయండి



యల్లనూరు మండలం మేడికుర్తిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వీరరాజు

యల్లనూరు: మండలవ్యాప్తంగా కులగణన సర్వే పారదర్శకంగా చేయాలని ఎంపీడీఓ వీరరాజు సిబ్బందికి సూచించారు. శనివారం మేడికుర్తి, నిట్టూరు, వేములపల్లి, పెద్దమల్లేపల్లి తదితర గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. తప్పులు లేకుండా కుల గణన సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరకు సూచించారు. అనంతరం యాప్‌లో కులాల వివరాలను కనుక్కొని జాగ్రత్తగా అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా శనివారం కుల గణన కార్యక్రమం కొనసాగింది. మండల కేంద్రంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేపడుతున్న కుల గణన కార్యక్రమాన్ని ఎంపీడీఓ యోగానందరెడ్డి పరిశీలించారు. ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను పూర్తిగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో శనివారం కుల గణన కార్యక్రమం చురుగ్గా కొనసాగింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : కుల గణన సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంఈఓ -2 గురుప్రసాద్ సిబ్బందికి సూచించారు. శనివారం బుర్నాకుంట సచివాలయంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కుల గణన సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కుల గణన ప్రక్రియ ను ఎలా చేయాలో వివరించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న కేసీ హరి

గుంతకల్లు: పట్టణంలోని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 1984లో కళాశాలను స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కళాశాలలో చదివిన విద్యార్థులంతా ఒకచోట చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పీ.గోపాల్ అధ్యక్షత వహించగా కరస్పాండెంట్ కేసీ హరి హాజరై మాట్లాడారు. వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు అందరూ ఒక చోట కలిసి వారి జీవిత అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా స్నేహభావం మరింత బలపడుతుందన్నారు. విశ్రాంత ప్రిన్సిపాళ్లు బాలయ్య, డాక్టరు రామకృష్ణనాయుడు, పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి ఖాజవలి, సభ్యులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ నటరాజ్, కళాశాల పీఆర్‌ఓ బసెట్టి కృష్ణయ్య, ఏఓ డాక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి అంకాలమ్మ, కుంటెమ్మ జాతర

పామిడి: స్థానిక పీ కొండాపురంరోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ 16వ జాతర ఈనెల 23 నుంచి రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. జాతరను పురస్కరించుకొని 23న పాలపళ్ల విభాగం, 18న న్యూ కేటగిరీ విభాగాల్లో రాతిదూలం లాగుడు పోటీలు ఉంటాయన్నారు. పాలపళ్ల విభాగంలో విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, న్యూ కేటగిరి విభాగంలో రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15వే లు, రూ.10వేలు నగదు బహుమతులు అందజేస్తామని వివరించారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం

గుంతకల్లు: విజయవాడలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వై.భీమలింగ, నాయకులు మురళి, సంపత్, రమేష్ పేర్కొన్నారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దాదాపు రూ.400 కోట్లతో 206 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని విజయవాడ నడుబొడ్డున ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగనమోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ఏ నాయకుడికి రాని ఆలోచన జగనన్నకు వచ్చిందంటే దళితులు, గిరజనల పట్ల ఆయనుకు ఉన్న అపార గౌరవమని కొనియాడారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

శింగనమల: రైతులు పంటల సాగులో నూతన పద్ధతులను అవలంభించి అధిక దిగుబడులు సాధించాలని శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు తెలిపారు. శనివారం సోదనపల్లి గ్రామంలో రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చందన, శ్రీకృష్ణదేవరాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ విద్య, రైతులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

యాడికి: మతి స్థిమితం లేని వ్యక్తి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మండల కేంద్రంలోని కోమటి బజారులో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. పెద్దమ్మ గుడి సమీపంలో కిరాణా కొట్టు నివసిస్తున్న వెంకటరాముడుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు నవీన్(30) చిన్నప్పటి నుంచి మతి స్థిమితం లేదు. కుటుంబ సభ్యుల సమక్షంలోనే సాయంత్రం కిరాణా షాపులో ఉన్న బ్లేడు తీసుకొని గొంతు కోసుకున్నాడు. దీంతో రక్తం రావటంతో భయబ్రాంతులకు గురైన కుటంబ సభ్యులు వెంటనే అసంతపురం సవీరా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి ప్రాణాపాయం తప్పినట్లు స్థానికులు తెలిపారు.

ఆధ్యాత్మిక మార్గంతోనే ఉత్తమ జీవితం

అనంతపురం కల్చరల్: మనిషికి మానసిక ప్రశాంతతనిచ్చి ఉత్తమ జీవితాన్ని ప్రాప్తింపజేసేది ఆధ్యాత్మిక మార్గమేనని వ్యాసరాజ మఠం పీఠాధిపతులు విద్యాశ్రీష తీర్థులు ప్రబోధించారు. కర్ణాటకలోని సోసలే పీఠం నుంచి హైదరాబాదు వెళ్తూ మార్గంమధ్యలో నగరంలోని పాతూరు వ్యాసరాజ మఠంలో విడిది చేశారు.